క్లుప్తంగా

పారిశుధ్యం మెరుగుకు చర్యలు



33వ వార్డులో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

అల్లిపురం : పారిశుధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో వార్డు నాయకులు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను వ్యక్తిగతంగా కలిసి చెత్త తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన అభ్యర్థన మేరకు జోనల్ కమిషనర్ శివప్రసాద్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, నాగేశ్వరరావుతో పారిశుధ్య కార్మికులు పి.శివ, శ్రీను, మత్స్యరాజు, పోలారావులతో వార్డులో కొన్నిచోట్ల చెత్తను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

యూజీ హాస్టల్ అదనపు వసతికి భూమిపూజ

మహారాణిపేట : యూజీ హాస్టల్లో అదనపు వసతి కోసం శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బి.వి.సత్యవతి ఈ పనుల కోసం రూ. 15 లక్షలు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ నిధులతో నిర్మిస్తున్న హాస్టల్ భవనాలకు శుక్రవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ అండ్ హెల్త్ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాయుడు, డీఈఈ మన్మథరావు, పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

హాస్య నాటిక ప్రదర్శన రేపు

మురళీనగర్: కళల ప్రోత్సాహంలో భాగంగా మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఈ నెల 7న హాస్య నాటిక ప్రదర్శించనున్నట్లు పార్కు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాత్రి 7 గంటలకు ఏక్ దిన్‌కా సుల్తాన్ నాటికను మాధవధార శ్రీచైతన్య కళాసాగర్ నటులు ప్రదర్శిస్తారన్నారు. జంధ్యాల రచించిన ఈ హాస్య నాటికకు సనపల సన్యాసయ్య దర్శకత్వం, ఎల్‌వీ రమణ పర్యవేక్షణ వహిస్తారని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరానికి చక్కటి స్పందన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీవత్సవ్

జగదాంబ : ఉచిత హోమియో శిబిరానికి విశేష స్పందన లభించింది. జీవీఎంసీ 35వ వార్డు దుర్గాలమ్మ ఆలయం వద్ద హోమియో వైద్యులు డాక్టర్ సుజిత్ ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లిబాబు, లంక మోహనరావు పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యల పరిష్కారానికి వినతి

దాబాగార్డెన్స్ : ఆర్టీసీ ఉద్యోగుల ఆర్థిక సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రుల సబ్‌కమిటీ సభ్యుడు, మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. దేవరాజులు, ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాసరావు నేతృత్వంలో కమిటీ బృందం శుక్రవారం మంత్రి బొత్స సత్యనారాయణను ఆయన కార్యాలయంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు రావల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పండగలోపే ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు టి. రాజేంద్ర, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు జీవీ రావు, రవిబాబు, జానీ, జి. రాధాకృష్ణ, ఉప ప్రధాన కార్యదర్శులు జీపీ రావు, టి. రవిశంకర్, కమిటీ సభ్యులు పీవీ రావు, ఎంఎస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పండగలా.. పింఛన్ల పంపిణీ

• హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

ఇచ్చిన మాట తప్పని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలు, వితంతువులకు రూ. 3 వేలు పింఛన్‌ను ఈనెల నుంచి అందిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు సీఎం జగన్ పాలనకు బ్రహ్మరథం పడుతున్నారు. కన్నవారే పట్టించుకోని ఈ రోజుల్లో ఇంటికి పెద్ద కొడుకులా జగన్ ఆదుకుంటున్నాడని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



33వ వార్డులో వృద్ధురాలికి పెంచిన పింఛన్ అందజేస్తున్న బొర్రా విజయలక్ష్మి తదితరులు

అల్లిపురం : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవ్వాతాతలు, వితంతువులకు ఎన్నికల హామీగా దఫదఫాలుగా పింఛన్ రూ.3 వేలకు పెంచుతామన్న మాటను నిలబెట్టుకున్నారు. 2019 నుంచి 2024 వరకు విడతకు రూ.250 చొప్పున పెంచుతూ రూ. 3 వేలకు పింఛన్లు పెంపు చేశారు. తాజాగా ఈ నెల నుంచి పెంచిన ఫించన్ అందజేయనున్నట్లు చెప్పిన ముఖ్యమంత్రి అన్నమాట ప్రకారం రూ. 3 వేలు చొప్పున పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం నుంచి 33వ వార్డులో పెరిగిన పింఛన్ అందజేయటం మొదలు పెట్టారు. దీంట్లో భాగంగా తెల్లవారుజాము నుంచి వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ ప్రారంభించారు. వారికి తోడుగా వార్డు నాయకులు, మాజీ అధ్యక్షుడు రంది గోపీకృష్ణ, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు, నగర మాజీ కార్యదర్శి పాల శ్రీహరిరెడ్డి, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, మాదాబత్తుల రమేష్, బొర్రా శ్రీనివాసరెడ్డి పాల్గొని పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు ఝాన్సీ, హేమలత, కిరణ్మయి, భవానీ, కృష్ణభార్గవ్, రమ్య, పుష్పరాణి, గృహసారథులు చిన్నిలక్ష్మి, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



29వ వార్డులో పింఛన్ అందజేస్తున్న పీతల వాసు

జీవీఎంసీ 29వ వార్డులో..

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 29వ వార్డు వెంకటపతి రాజునగర్‌లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షుడు పీతల వాసు నేతృత్వంలో పలువురు వృద్ధులకు వలంటీర్ల సాయంతో రూ.3 వేల పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా పీతల వాసు మాట్లాడుతూ రూ.3 వేల వరకు పింఛన్ పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములకు బాసటగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలిచిందన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎం చేయాలని, అలాగే నిత్యం ప్రజా సేవలో.. ప్రజలకు అందుబాటులో ఉంటున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ బెవర మహేష్, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

30వ వార్డు తాడివీధి కమ్యూనిటీ హాల్లో..

మహారాణిపేట : శుక్రవారం 30వ వార్డు తాడివీధి కమ్యూనిటీ హాల్లో పెంచిన రూ. 3 వేల పింఛన్‌ను లబ్ధిదారులకు వార్డు కార్పొరేటర్ కొడూరు అప్పలరత్నం (కొండమ్మ) అందజేశారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా అనేక సంక్షేమ పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారని అన్నారు. వార్డులో 1250 పింఛన్లు ఉన్నాయని, ప్రతి నెల క్రమం తప్పకుండా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి పెంటపల్లి సత్యనారాయణ, వెల్ఫేర్ కార్యదర్శి సునీత, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వద్దాది దిలీప్‌కుమార్, నాయకులు దేవరాజు, మణి తదితరులు పాల్గొన్నారు.



33వ వార్డులో పింఛన్లు అందజేస్తున్న పాల శ్రీహరిరెడ్డి తదితరులు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ అప్పలరత్నం తదితరులు

27వ వార్డులో..

సీతమ్మధార : జీవీఎంసీ 27వవార్డు దొండపర్తిలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ శుక్రవారం జరిగింది. శీరపువారి వీధి, మండవారివీధిలో ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి జనవరిలో రూ. 3 వేలు పెన్షన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ అంగటికుమారి, గృహసారథులు చిరంజీవి, శ్రీనివాస్, బాబు పాల్గొన్నారు.



29వ వార్డులో పింఛన్ అందుకున్న ఆనందంలో వృద్ధులు



తాడివీధికి చెందిన అప్పారావుకు పింఛను అందజేస్తున్న కార్పొరేటర్ అప్పలరత్నం



27వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న నీలాపు సర్వేశ్వరరెడ్డి

ఆర్థిక భరోసా కల్పించారు..



మాది చాలా పేద కుటుంబం. 30వ వార్డు తాడి వీధిలో భార్యా, పిల్లలతో నివసిస్తున్నాను. పింఛను పెరగడం వల్ల మా కుటుంబానికి ఎంతో మేలు జరుగుతుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

– మహ్మద్ అబ్దుల్ రఫీ, జెండా చెట్టు వీధి

సీఎం జగన్ చల్లగా ఉండాలి..



గతంలో చాలా తక్కువ పింఛన్ వచ్చేది. ఇల్లు గడవడం ఇబ్బందిగా ఉండేది. నేడు రూ. 3 వేలకు పింఛన్ పెంచడం వల్ల ఆర్థికంగా బాగుంది. పేదల పట్ల ఆలోచిస్తున్న సీఎం జగన్ చల్లగా ఉండాలి.

– కాకర మీరాకుమారి, తాడివీధి

ఇలాంటి ముఖ్యమంత్రే కావాలి..



నా భర్త చనిపోవడంతో చాలా ఇబ్బంది పడ్డాం. ఆ తర్వాత నాకు పింఛను రావడంతో కొద్దిగా పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఇప్పుడు రూ. 3 వేల పింఛన్ రావడంతో కుటుంబ ఖర్చులు, మందులకు ఇబ్బంది లేదు. ఇలాంటి ముఖ్యమంత్రే అందరికీ కావాలి

– ఎం.కామేశ్వరి, కుమ్మరివీధి

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



విశేష పూజలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 23వ రోజు శుక్రవారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ, క్షీరాభిషేక సేవ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2 వేల మూడు వందల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

‘జనభాగీధారి’తో అంబేడ్కర్ భావజాల వ్యాప్తి

మహారాణిపేట : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలాన్ని వివరిస్తూ జనభాగీధారి పేరిట ప్రజా చైతన్య కార్యక్రమాలను ఈ నెల 9 నుంచి 18 వరకు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ జిల్లా సమన్వయ కమిటీ సభ్యులకు ఆదేశించారు. ఈ నెల 19వ తేదీన అమరావతిలోని స్వరాజ్ మైదానంలో స్మృతివనం ప్రారంభోత్సవం సందర్భంగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో జిల్లాలో చేపట్టబోయే కార్యక్రమాలపై ఆయన శుక్రవారం అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. తొలి రోజు 9వ తేదీ ఉదయం ఎల్.ఐ.సి. బిల్డింగ్ వద్ద ఉన్న అంబేడ్కర్ జంక్షన్ నుంచి రామాటాకీస్ సమీపంలోని అంబేడ్కర్ భవన్ వరకు భారీ మారథాన్ నిర్వహించాలని సూచించారు. 9, 10 తేదీల్లో రక్తదాన శిబిరాలు, జిల్లా స్థాయి ఫొటో ఎగ్జిబిషన్, అంబేడ్కర్ జీవిత విశేషాలపై డాక్యుమెంటరీ, లఘు చిత్రాల ప్రదర్శన, 18వ తేదీన ఎల్.ఐ.సి. బిల్డింగ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించాలని, మానవహారం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సామాన్య పౌరులు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవకులను భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏడీసీ వర్మ, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు వి. మణిరామ్, డీఈవో ఎల్. చంద్రకళ, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న జేసీ విశ్వనాథన్

వెంకటేశ్వరమెట్ట సమస్య పరిష్కారానికి వినతి

అల్లిపురం : వెంకటేశ్వరమెట్ట నివాసులకు, దేవదాయ శాఖకు గల సమస్య ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చొరవతో ఒక కొలిక్కి వచ్చింది. ఈ మేరకు వెంకటేశ్వరమెట్ట హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శరగడం మోహన్‌రావు, కార్యదర్శి భీశెట్టి శ్రీనివాసరావు, కోరిబిల్లి ప్రసాద్, శ్యామ్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి శుక్రవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తమ తాత, ముత్తాతల కాలం నుంచి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నామని తెలిపారు. తాము నిర్మించుకున్న వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని 1971లో పెద్దల సమక్షంలో దేవదాయ శాఖకు అప్పగించామని తెలిపారు. అప్పటి నుంచి అవసరాలకు ఆస్తులు అమ్ముకోవాలన్నా, అభివృద్ధి చేసుకోవాలన్నా దేవాదాయ శాఖ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని కోరగా.. స్పందించిన ధనుంజయరెడ్డి త్వరలోనే శుభవార్త వింటారని హామీ ఇచ్చారని వివరించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే వాసుపల్లికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు.



ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయరెడ్డికి ఎమ్మెల్యే వాసుపల్లితో కలిసి వినతిపత్రం అందజేస్తున్న కార్యవర్గ సభ్యులు

నైతిక విలువలతో కూడిన విద్యాబోధన అవసరం

దాబాగార్డెన్స్ : ఇస్కాన్ అనుబంధ విద్యా సంస్థ డివైన్ టచ్ 13వ వార్షికోత్సవం శుక్రవారం నగరంలో నిర్వహించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నైతిక విలువలతో కూడిన విద్యాబోధన అందించడమే కాక, మన సంస్కృతి, సాంప్రదాయాలు తెలపాలన్నారు. పాఠశాల పనితీరును ప్రశంసించారు. స్కూల్ ప్రిన్సిపాల్ నేహాదాస్ మాట్లాడుతూ పాఠశాల ద్వారా విద్యార్థులకు చక్కని బోధన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ జీబీసీ చైర్మన్ రేవతి రామన్‌దాస్, భక్తి వేదాంత మిషన్ స్కూల్ ప్రిన్సిపాల్ భక్తి, ఇస్కాన్ విశాఖ నగర శాఖ అధ్యక్షుడు సాంబదాస్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్ పాల్గొన్నారు.



రామాయణంలోని ఒక ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నేడు గీత్ సంగీత్ సినీ సంగీత విభావరి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సన్యాసిరాజు (తాతాజీ) తదితరులు

దాబాగార్డెన్స్ : సాంస్కృతిక సినీ సంగీత సంస్థ గీత్ సంగీత్ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈ నెల 6న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు మహ్మద్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం వార్షికోత్సవ పోస్టర్‌ను కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ) చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ యమునా తీరం సంధ్యారాగం పేరిట నిర్వహించనున్న సినీ సంగీత విభావరిలో తెలుగు, హిందీ చలన చిత్రాల్లోని పలు గీతాలను నగరానికి చెందిన గాయనీ గాయకులు ఆలపించనున్నారని చెప్పారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కళా ప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంపీ రాజశేఖర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఏపీ ఎన్జీవో నేతల శుభాకాంక్షలు



కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎన్జీవో నాయకులు

మహారాణిపేట : ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డి ఆధ్వర్యంలో ఎన్జీవోలు శుక్రవారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆరోగ్యశ్రీ సీఈవోగా పని చేసిన ఆయన ఉద్యోగులకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ని బలోపేతం చేయడంలో చేసిన కృషిని ప్రశంసించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రొంగలి రవిశంకర్, రాష్ట్ర సహాధ్యక్షుడు డి.వి.రమణ, సిటీ కార్యదర్శి వీవీవీఆర్‌వీ సత్యనారాయణ, జిల్లా కోశాధికారి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు ఉమ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం.. ఆంధ్ర ఫైనల్ పోటీల నిర్వహణ



ఇందిర ప్రియదర్శిని గ్రౌండ్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

జగదాంబ : ఆడుదాం ఆంధ్రా ఫైనల్ పోటీలు నియోజకవర్గంలో జరిగాయి. కొద్ది రోజులుగా జీవీఎంసీ 35వ వార్డు ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న ఈ క్రీడల్లో భాగంగా శుక్రవారం క్రికెట్, షటిల్, కబడ్డీ, ఖోఖో పోటీల ఫైనల్స్ జరిగాయి. వీటిలో గెలుపొందిన క్రీడాకారుల వివరాల నివేదికను సెక్రటరీలు ఉన్నతాధికారులుకు అందజేశారు.



విజేతలకు కిట్లు అందిస్తున్న సర్వేశ్వరరెడ్డి

విజేతలకు కిట్ల పంపిణీ..

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులోని 141,143,144,145 ` సంచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో పాల్గొని విజేతలుగా నిలిచిన జట్లకు క్రికెట్, వాలీబాల్ కిట్లు వార్డు అధ్యక్షుడు, ఎరుకుమాంబ దేవస్థానం చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి అందించారు.

ఓబీసీ ఉద్యోగుల సమీక్ష సమావేశం

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వేలో ఓబీసీ ఉద్యోగుల సంక్షేమం, వాటి అమలు, ఇతర సమస్యలపై శుక్రవారం భువనేశ్వర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు అలిండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్ తెలిపారు. ఓబీసీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ రాజేష్‌వర్మ, 30 మంది ఎంపీలు, కమిటీ సభ్యులు న్యూఢిల్లీ నుంచి ఈస్ట్ కోస్ట్ రైల్వే హెడ్ క్వార్టర్స్ భువనేశ్వర్‌లో జరిగిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై ప్రస్తావించారని చెప్పారు. ఓబీసీ కార్మికులు, నాయకులపై కక్ష సాధింపు చర్యలను అధికారులు, యాజమాన్యం విడనాడేలా తగిన సూచనలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఓబీసీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వారికి వినతిపత్రం అందించామని రాజశేఖర్ తెలిపారు. నిర్వాహక అధ్యక్షులు రామచంద్రరావు, బి.కె. సాహూ, శివప్రసాద్, జి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పాలసీదారు మరణిస్తే పరిహారం తల్లికి అందజేయాలి

విశాఖ లీగల్ : బీమా పాలసీ అమలులో ఉండగా పాలసీదారుడు మృతి చెందితే పరిహారాన్ని తల్లికి చెల్లించాలని విశాఖలోని వినియోగదారుల మండలి-1 అధ్యక్షురాలు డాక్టర్ గుడ్ల తనూజ తీర్పునిచ్చారు. బీమా సొమ్ము 24,08,432 రూపాయలతో పాటు, రూ.40 వేల పరిహారం, రూ. 5 వేల ఖర్చులు చెల్లించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా రావికమతం మండలం వైఎస్సార్ నగర్ ప్రాంతానికి చెందిన శెట్టి నూకేశ్వరరావు 2021 ఏప్రిల్‌లో మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పాలసీ తీసుకున్నారు. అతనికి 2023 ఆగస్టులో పచ్చకామెర్లు వచ్చి మరణించారు. బీమా పాలసీ అమలులో ఉన్నందున తమ కుమారుడికి సంబంధించిన సొమ్మును ఇవ్వాలని మృతుడి తల్లి వినియోగదారుల మండలిని ఆశ్రయించారు. మృతుడిది ప్రమాదం, లేదా సహజ మరణం కానందున పాలసీ సొమ్ము ఇవ్వడానికి వీల్లేదని కంపెనీ స్పష్టం చేసింది. దీనిపై సమగ్ర విచారణ జరిపిన న్యాయమూర్తి మృతుడు మరణించిన సమయంలో పాలసీ అమల్లో ఉన్నందున బీమా సొమ్ము ఇవ్వాలని పేర్కొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు శిక్షణ తరగతులు

దాబాగార్డెన్స్ : స్వయం సహాయక సంఘ సభ్యులందరికీ సుస్థిర జీవనోపాధి అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేశారని మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం జీవీఎంసీ ప్రాజెక్టు డైరెక్టర్(యూసీడీ) కేవీ పాపునాయుడుతో 4 జిల్లాల పథక సంచాలకులు, మెప్మా సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘ సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారికి అవగాహనతో కూడిన శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. జగనన్న మహిళా మార్ట్, జగనన్న ఈ-మార్ట్, పట్టణ ప్రగతి యూనిట్లు, ఆహా క్యాంటీన్లు, మెప్మా అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు ఏర్పాటు చేయడమైందన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి నుంచి సరోజిని, శ్రీకాకుళం నుంచి ఎం. కిరణ్‌కుమార్, విజయనగరం నుంచి బి. సుధాకరరావు, ఎస్ఎంసీలు ఆదినారాయణ, ఎన్. శ్రీనివాసరావు, రంగాచారి, లక్ష్మీనారాయణతో పాటు 4 జిల్లాల నుంచి డీఎంసీలు, సీవోలు పాల్గొన్నారు.

కాపులు రాజ్యాధికారం సాధించే దిశగా ఎదగాలి

దాబాగార్డెన్స్: కాపులు రాజ్యాధికారం సాధించే దిశగా ఎదగాలని రాష్ట్ర కాపునాడు కన్వీనర్ గిద్దా శ్రీనివాసనాయుడు పేర్కొన్నారు. కాపులు రాజ్యాధికారం, భవిష్యత్ కార్యాచరణపై ఈ నెల 7న విజయవాడ, గాంధీనగర్ ఐలాపురం హోటల్లో కాపునాడు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపునాడు విశాఖ కన్వీనర్ తలారి సురేష్, మంగతాయారు, సీతారం, మద్దింశెట్టి సురేష్, ప్రొఫెసర్ సూరప్పడు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు టెండరులో పాల్గొనాలి

దాబాగార్డెన్స్ : జీవీఎంసీలో పొరుగు సేవల ద్వారా పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు గత నెల 26 నుంచి విధులకు గైర్హాజరవుతున్నందున గృహ, గృహేతరాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యర్థపదార్థాలు ఎప్పటికప్పుడు తరలించేందుకు అద్దె ప్రాతిపదికన టాటా వెహికల్స్ సమకూర్చేందుకు స్వల్ప వ్యవధితో కూడిన ఈ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ జారీ చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల కాంట్రాక్టర్లు, ఏజెన్సీలు టెండర్ నియమ నిబంధనలకు లోబడి పాల్గొనాలని కమిషనర్ పేర్కొన్నారు.